

# హైదరాబాద్ వార్త

# బిఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

**మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**



గడప గడపకు ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

**సంజీవరెడ్డి నగర్, అక్టోబర్ 20, ప్రభాతవార్త**

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగాలంటే బిఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమౌతుందని సనత్‌నగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని అమీర్‌పేటలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బల్కంపేట ఎల్లమ్మ ఆలయం నుండి ప్రచారం ప్రారంభించి సుప్రభాత్‌నగర్, రేణుక నగర్, బిజెఆర్1 శ్రీరాంనగర్‌లో పాదయాత్ర నిర్వహించి, విస్తృత ప్రచారం చేశారు. అభ్యర్థి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు అడుగడుగునా డప్పు చప్పుళ్ళు, పూలవర్షంతో సాదరస్వాగతం పలికారు. గడప గడపలో ఆయనకు మహిళలు మంగళ హారతులు పట్టి, నుదటన కుంకుమ తిలకం దిద్ది, శాలువాలు, పూలతో ఘనస్వాగతం పలుకుతు తమ అభిమానాన్ని చాటుకున్నారు. రేణుక నగర్, బిజెఆర్ నగర్ తదితర ప్రాంతాలలో దేవీ నవరాత్రుల సందర్భంగా ప్రతిష్టించిన దుర్గామాత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా పరిష్కారం కానీ సమస్యలను పరిష్కరించామని మళ్ళీ కారు గుర్తుకే తమ ఓటు వేసి సంపూర్ణ మద్దతు తెలపాలన్నారు. నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తూ వచ్చానని తెలిపారు. సమస్యలను తెలుసుకుని వెంటనే స్పందించి పరిష్కరించే నాయకుడు ఉండటం మా అదృష్టమని, మిమ్మల్ని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని స్థానికుల తమ సంపూర్ణ మద్దతును తెలిపారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జీ తలసాని సాయి కిరణ్‌యాదవ్, మాజీ కార్పోరేటర్ నామన శేషుకుమారి, డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు హన్మంతరావు, జనరల్ సెక్రటరీ సంతోష్, నాయకులు అశోక్ యాదవ్, కరుణాకర్ రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, కూతురు నర్సింహా, ఉత్తమ్ కుమార్ రాజ్ పురోహిత్, టిల్లు, లాహూర్‌సింగ్, జోగిందర్ సింగ్, నందీశ్, మల్లయ్య గౌడ్, వనం శ్రీనివాస్, హరిసింగ్, రమేష్ మోత్కుపల్లి, కట్టా బలరాం, శ్రీనివాస్, సీనియర్ సిటిజన్‌లు పార్థసారథి, సహదేవ్‌గౌడ్, ఆర్‌సి కుమార్, లక్ష్మీ, రాణికౌర్, నాగలక్ష్మీ, లలిత, లలితాచౌహాన్ పాల్గొన్నారు.

# మేమెంతో మాకన్ని సీట్లు కేటాయించాలి

**తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ నేతల డిమాండ్**




మాలల మహాధర్నాలో అభివాదం చేస్తున్న తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ నేతలు

**ధర్నాచౌక్, అక్టోబర్ 20, ప్రభాతవార్త:**

రాబోయే ఎన్నికలలో జనాభా దామాషా ప్రకారం మేమెంత ఉన్నామో మాకు అన్ని సీట్లు ప్రతి రాజకీయ పార్టీ కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ ఛైర్మన్ చెరకు రాంచందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో మాలల మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేసించి రాంచందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మాలలకు రాజకీయ ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉందని, కొన్ని జిల్లాలలో అసలులేదని ఆరోపించారు. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాలలో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, అందువల్ల మాలలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారని అన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలైన ఎస్సీ కార్పొరేషన్ లోన్లు, మూడు ఎకరాల భూమి, గురుకుల పాఠశాలు, దళితబంధు పథకంలో కూడా మాలలకు అన్యాయం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాలలకు జనరల్ నామినేటెడ్ పదవులలో తీవ్ర అన్యాయం జరుగుతోందని మండిపడ్డారు. మాలల జనాభా ప్రకారం ప్రతి రాజకీయ పార్టీలో 12 సీట్లు కేటాయించాలని, జనరల్ సీట్లలో కూడా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. మాలలను విస్మరించే రాజకీయ పార్టీలను ఎన్నికల ద్వారా ఓడించి, బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ధర్నాలో జేఏసీ నేతలు, వివిధ జిల్లాల నుండి వచ్చిన మాలలు పెద్దఎత్తున హాజరయ్యారు.

# సనత్‌నగర్‌లో కాంగ్రెస్‌ను గెలిపించుకుంటాం

**పార్టీ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్‌యాదవ్**



మాట్లాడుతున్న అనిల్‌కుమార్‌యాదవ్

**బేగంపేట అక్టోబరు 20, ప్రభాతవార్త**

సనత్‌నగర్ నియోజకవర్గంలో ఐకమత్యంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డా. కోట నీలిమను గెలిపించుకుంటామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. శుక్రవారం బేగంపేట పైగా ప్యాలెస్ లో కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గం జనరల్‌బాడీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ నియోజకవర్గం ఏఐసీసీ పర్యవేక్షకులు రూబీ మనోహర్, అభ్యర్థి డా. కోట నీలిమ, డివిజన్ల అధ్యక్షులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ సనత్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి మంచి ఆదరణ ఉందని, ప్రజల మద్దతు చూస్తుంటే తమ అభ్యర్థి విజయం ఖాయం అని అనిపిస్తుందన్నారు. ప్రతి కార్యకర్త ఐకమత్యంగా ఉండి నీలిమ విజయానికి కృషి చేయాలని పిలుపు నిచ్చారు. రూబీ మనోహర్ మాట్లాడుతూ సోనియా గాంధీ, మల్లిఖార్జున్ ఖర్గే రాహుల్‌గాంధీ మార్గదర్శకంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. డాక్టర్ కోట నీలిమ మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పథకాలు అందరికీ అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.

కార్యకర్తల నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే సంతోషంగా ఉందన్నారు. తనను వారి ఆడబిడ్డగా ఆదరిస్తున్న వారి రుణం ఎమ్మెల్యేగా విజయం సాధించిన అనంతరం వారికి కావాల్సిన అభివృద్ధి చేసి తీర్చుకుంటానని ఆమె తెలియజేసారు. ఈ కార్యక్రమం లో డివిజన్ అద్యక్షులు మల్లిఖార్జున్, అమానుల్లా ఖాన్, ఆర్. కిషోర్‌కుమార్‌నాయక్, రాయికోడ్ నరేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పార్టీలు, అభ్యర్థులకు మార్గదర్శకాలు



**హైదరాబాద్, అక్టోబరు 20 ప్రభాతవార్త**

ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలు జారీ చేసింది. వాటిని ఖచ్చింతంగా పాటించాలని సూచించింది.

-రాజకీయ పార్టీ అభ్యర్థి, కుల, మత, భాష ద్వేషాలను రెచ్చగోట్టే ప్రసంగాలు చేయరాదు.

-విధానాలు, పథకాలు, కార్యక్రమాలపైన మాత్రమే విమర్శలు ఉండాలి, వ్యక్తిగత జీవితంపై విమర్శకులకు తావుండరాదు.

-కుల, మత ప్రాతిపదికన ఓట్లు అడగకూడదు, మందిరాలు, మజీదులు, చర్చిలు, ఇతర ప్రార్థనా ప్రదేశాలను ఎన్నికల ప్రచారానికి వాడుకోరాదు.

-ఓటు కోసం డబ్బులు ఇవ్వడం, బెదిరించడం నిషేధం, ఒక వ్యక్తి ఓటును మరొక వ్యక్తి వేయడం చట్ట వ్యతిరేకం.

-వ్యక్తుల అనుమతి లేనిదే వారి భూములు, భవనాలు ప్రచారానికి వినియోగించరాదు.

-ఇతరపార్టీల ఎన్నికల ప్రచారాలకు, సమావేశాలకు ఆటంకం కలిగించరాదు.

-ఎన్నికల ప్రచార సమావేశాలకు పోలీసుల నుంచి ముందుగా లిఖితపూర్వకంగా అనుమతి పొందాలి.

-నిషేదాజ్ఞలు, ఆంక్షలున్న ప్రదేశాల్లో సమావేశాలు నిర్వహించవద్దు.

-సమావేశాల్లో మైక్, లౌడ్ స్పికర్ల వినియోగానికి ముందుగా అనుమతి తీసుకోవాలి.

-సమావేశానికి ఎవరైన అటంకం కలిగిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

-ఊరేగింపులు, ప్రదర్శనల రూటు ముందుగానే పోలీసులకు తెలియజేయాలి.

-ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఊరేగింపు నిర్వహించాలి.

-ఎలాంటి దిష్టిబొమ్మలు దహనం చేయరాదు,

-మంత్రులు పోలింగ్ కేంద్రాల్లోకి ప్రవేశించరాదు.

-అధికార పార్టీ నేతలు ఎన్నికల ప్రచారాన్ని అధికారిక పర్యటనలలో కలిపి చేయరాదు.

-అధికారయంత్రాంగాన్ని వాడుకోరాదు, ప్రభుత్వ వాహనాలు వాడకూడదు. అతిధి గృహాలు అందరికి ఇవ్వాలి. వీటిపై ఎవరి పెత్తనం ఉండొద్దు.

-రోడ్డు నిర్మాణం, తాగునీటి సౌకర్యం కల్పిస్తామని వాగ్దానాలు చేయరాదు.

-ఉద్యోగుల బదిలీలపై నిషేధం ఉంటుంది.

-మంత్రులు ఎన్నికల అధికారులను పిలువకూడదు.

-ప్రైవేటు పనులపైన వచ్చిన మంత్రులను ఏ అధికారి కలువకూడదు.

-పైలెట్ కార్లు, ఎర్ర బుగ్గ కార్లు ఉపయోగించకూడదు.

-ఎంపి ల్యాడ్స్ నిధులు మంజూరు చేయొద్దు. కొత్త పనులు చేపట్టకూడదు, కొత్త పనులకు అమోదం తెలపకూడదు.

# అభ్యర్థులను ప్రకటించలేని వాళ్లు అధికారంలోకి వస్తారా ?

**దానం నాగేందర్ ఎద్దేవా..**




మాట్లాడుతున్న దానం నాగేందర్

**ఫిల్మ్‌నగర్, అక్టోబర్ 20, ప్రభాతవార్త**

అభ్యర్థుల జాబితాను ప్రకటించడంలో ఏకాభిప్రాయం లేని కా ంగ్రెస్, బిజెపిలు అధికారంలోకి వస్తాయని పగటి కలలు కనడం హాస్యాస్పదమని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ముచ్చటగా మూడోసారి బిఆర్ఎస్ విజయం సాధించి, హ్యాట్రిక్ ముఖ్యమంత్రి కెసిఆర్ అధికార పగ్గాలు చేపట్టడం తథ్యమని దానం జోస్యం చెప్పారు. కార్యకర్తలందరూ సమిష్టిగా పనిచేసి ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా తానని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే దానం నాగేందర్ కోరారు. రూ.400కే గ్యాస్ సిలీండర్ సరఫరాను మేనిఫెస్టోలో పొందుపరిచిన ఘనత ముఖ్యమంత్రి కెసిఆర్‌కే దక్కుతుందని, దేశ చరిత్రలోనే ప్రథమమన్నారు. సోమాజీగూడ డివిజన్‌లోని జయ గార్డెన్స్ ఆవరణలో బతుకమ్మ సంబరాలలో ఘనంగా జరిగాయి. అనంతరం కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ కార్యకర్తలకు కష్టం వస్తే అండగా నిలబడి కాపాడుకునే బాధ్యత తనదేనని అన్నారు. కార్యక్రమానికి ముందు బతుకమ్మ సంబరాల్లో ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ వనం సంగీత, మహిళలతో కలిసి ఆడిపాడి ఆకట్టుకున్నారు. సంబరాలలో ఎమ్మెల్యే దానంతో పాటు హిందూ ముస్లి మహిళలు పాల్గొనడం పలువురిని విశేషంగా ఆకర్షించింది. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు వనం శ్రీనివాస్‌యాదవ్, సోమాజీగూడ కార్పొరేటర్ వనం సంగీత యాదవ్, గ్రంథాలయం సంస్థ ఛైర్మన్ ప్రసన్న, మాజీ కార్పొరేటర్ లక్ష్మీ నారాయణమ్మ, డివిజన్ అధ్యక్షులు షేక్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, రజని, వెంకట్, జగన్, కుర్షిద్, ఘయాస్‌భాయ్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు..

**నిజాంపేట, అక్టోబర్ 20, ప్రభాతవార్త**

నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప బ్లాక్ నెంబర్ 101 వద్ద నిర్మి స్తున్న రెండు అక్రమ బిల్డింగ్ నిర్మాణాల గురించి నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ మేనేజర్ చంద్రప్రకాష్‌కు సిపిఐ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. అనంతరం సిపిఐ మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ బాచుపల్లి మండలం పరిధిలోని ఎక్కడ చూసినా కబ్జాల మయం అవుతుందన్నారు. ఈ కబ్జాలకు రెవెన్యూ, మున్సిపల్ అధికారుల ప్రోత్సాహం ఉందని, 191 నిజాంపేట రాజీవ్ గృహకల్ప బ్లాక్ నెంబర్ 101 దగ్గర ఎలాంటి పర్మిషన్ లేకపోయినా కమర్షియల్ టౌన్ ప్లానింగ్ అధికారుల హస్తం లేనిదే ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. అదే ఒక పేదవాడు చిన్న రూమ్ కట్టుకుంటే ఉదయాన్నే వచ్చి కూలగొట్టే అధికారులు 5అంతస్తుల భవనం అయ్యేంత వరకు నిద్రపోతున్నారా అంటూ ప్రశ్నించారు. 15సంవత్సరాలుగా ఉన్న రాజీవ్ గృహకల్ప బస్టాండ్‌ను తీసేసి కమర్షియల్ బిల్డింగ్ చేస్తున్న అధికారులు చోద్యం చూస్తున్నారు తప్పా చర్యలు తీసుకోవడంలేదన్నారు. ప్రజలు కట్టే పన్నులతో జీతాలు తీసుకుంటున్నామే, ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందనే ఆలోచన కూడా వారికి రాలేదన్నారు. అలాగే 191 ఎన్‌టిఆర్ నగర్‌ను అయ్యప్ప దేవాలయం వద్ద ప్రభుత్వ భూమి కబ్జా చేసి చుట్టూ రేకులతో పెన్షన్ వేసి దాదాపు 10రోజులు అవుతున్నా రెవెన్యూ అధికారులు ఎం చేస్తున్నారని అన్నారు. వందల కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జాదారులు యధ్యేచ్ఛగా కబ్జా చేస్తుంటే కాపాడవలసిన అధికారులే చోద్యం చూస్తున్నారని అన్నారు. వచ్చే నెల ఎన్నికలు ఉన్నాయని కబ్జాదారులు ఇదే అదునుగా కబ్జాలు చేస్తున్నారని, వెంటనే ఈ కబ్జాలను ఆపి ప్రభుత్వ భూములను కాపాడాలని డిమాండ్ చేశారు.

## కరెంట్ కట్ చేసినందుకు ..

# ఆర్టీజన్‌పై కత్తితో దాడికి యత్నం

**అడ్డుకున్న ఏఈ.. మీర్‌చౌక్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు**



కత్తితోదాడికి యత్నిస్తున్న ఉమర్‌చౌదరిని అడ్డుకుంటున్న ఏఈ పిఎల్‌ఎన్ రాజు

**చార్మినార్, అక్టోబరు 20, ప్రభాతవార్త:** విద్యుత్ బకాయిలు వసూళ్లకు వెళ్ళిన అధికారులపై ఓవ్యక్తి కత్తితో దాడికి యత్నించిన ఘటన పాతబస్తీలో మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్ రాచకొండ రవీందర్ కథనం ప్రకారం.. మొగల్‌పురా విద్యుత్ కార్యాలయంలో ఆర్టీజన్ ఉద్యోగిగా మహ్మద్ సలీం రుహీ పనిచేస్తున్నాడు. ఈనెల 19వ తేదీన పురానీహవేలీ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఉమర్ చౌదరి ఇంటికి సంబంధించిన బిల్లు చెల్లించడం లేదని మహ్మద్ సలీం రుహీ కరెంట్ కట్ చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మొగల్‌పురా ఏఈ పిఎల్‌ఎన్‌రాజుతో కలిసి ఆర్టీజన్ మహ్మద్‌సలీం రుహీ ఉమర్‌చౌదరి ఇంటి మీదుగా బిల్లుల వసూళ్లకు వెళ్తున్నారు. అదేసమయంలో అక్కడ ఉన్న ఉమర్‌చౌదరి కరెంట్ ఎందుకు కట్ చేశావంటూ ఆర్టీజన్ సలీంరుహీపై దాడి చేయడంతోపాటు కత్తితో పొడిచే ప్రయత్నం చేశాడు. దీంతో అక్కడే ఉన్న ఏఈ పిఎల్‌ఎన్ రాజు ఉమర్‌చౌదరిని అడ్డుకున్నారు. అనంతరం ఈవిషయంపై ఏఈ పిఎల్‌ఎన్‌రాజు మీర్‌చౌక్ పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని చిన్నారి మృతి

**దుండిగల్, అక్టోబర్ 20 ప్రభాతవార్త:** అపార్ట్‌మెంట్ ముందు ఆడుకుంటున్న చిన్నారి బాలికను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన చిన్నారి చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మెదక్ జిల్లా, నర్సాపూర్‌కు చెందిన దశరథ్ జీవనోపాధి కోసం నగరానికి వలస వచ్చి దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేటలోని సింహాపురి కాలనీలోని అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తూ అందులో నివాసం ఉంటున్నాడు. దశరథ్ భార్య ముగ్గురు పిల్లలు కలరు. భార్య అపార్ట్‌మెంట్‌లోనే పనిచేస్తుండగా దశరథ్ వాచ్‌మెన్‌గా, వీలైనప్పుడు ఆటోను నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈక్రమంలో 19న సాయంత్రం 6:30గం సమయంలో దశరథ్ కుమార్తె ఏడాదిన్నర వయసున్న బాలిక అపార్ట్‌మెంట్ ముందు ఆడుకుంటుండగా గుర్తు తెలియని కారు ఢీకొట్టి వెళ్ళింది. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చిన్నారిని ఉస్మానియా వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా ప్రమాదానికి గురైన కారును గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమైయ్యారు.

## నేషనల్ పీపుల్స్ ఫ్రంట్ 119 అసెంబ్లీ స్థానాల్లో పోటీ

**వి.జి.ఆర్.నారగోని**

**సైఫాబాద్, అక్టోబరు 20 ప్రభాతవార్త:** వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని 119 స్థానాలకు పోటీ చేయాలని నేషనల్ పీపుల్స్ ఫ్రంట్ నిర్ణయించింది. 90 శాతం టిక్కెట్లును ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టిలకు కేటాయించాలని సమావేశం తీర్మానించింది. శుక్రవారం ఫ్రంట్ కే ంద్ర కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది. సమావేశానికి ఫ్రంట్ ఛైర్మన్ వి.జి.ఆర్.నారగోని అధ్యక్షత వహించగా సలీం భాష (రాజ్యాధికార పార్టీ), సి.హెచ్.బాలకృష్ణ, మహేష్‌బాబు (రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా) (గవాయి), కె.బి.శ్రీధర్, కొండలరావు (ఇండియన్ ప్రజా కాంగ్రెస్), పొకల కిరణ్ (సామాజిక తెలంగాణ రాష్ట్ర సమితి) తదితరులు పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో మహిళలకు సముచిత స్థానం కూడా ఇవ్వాలని, కుటుంబ, కులతత్వ, మతతత్వ రాజకీయాలు పెట్రేగిపోయాయని వాటికి అడ్డుకట్ట వేయాల్సిన సమయం అసన్నమైందని సమావేశం భావించింది. అలాగే సమావేశం ముఖ్యంగా ఈ ఎన్నికల్లో బిఆర్ఎస్, బిజెపి, కాంగ్రెస్ పార్టీలను ఓడించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. డబ్బు, మద్యం వంటి ప్రలోభాలకు ఓటర్లు గురికావద్దని సమావేశం పిలుపునిచ్చింది. ఫ్రంట్ తరుపున పోటే చేసే అభ్యర్థులను ప్రజలు భారీ మెజార్టితో గెలిపించాలని విజ్ఞప్తి చేసింది.

## పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివి: మధుకర్‌స్వామి

**హైదరాబాద్, అక్టోబరు 20 ప్రభాతవార్త :** విధి నిర్వహణలో పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివని అంబర్‌పేట పోలీస్ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ పి. మధుకర్‌స్వామి అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం అంబర్‌పేటలోని పోలీస్ శిక్షణా కేంద్రంలో మేగా రక్తదాన శిబిరం చేపట్టారు. శిబిరాన్ని ప్రిన్సిపల్ ప్రారంభించి రక్త దానం చేసిన పోలీసు సిబ్బందిని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విధినిర్వహణలో పోలీసులు చూపిస్తున్న త్యాగం ఎంతో గొప్పదన్నారు. సమాజంలో పోలీసుపాత్ర కీలకమన్నారు. రక్తదానం లో ఇతరుల ప్రాణాలు కాపాడవచ్చుని, పోలీసులకు విధులతో పాటు సామా జిక సేవా గుణం కలిగి ఉండాలని ఆయన ఆకాంక్షించారు. రక్తదాన శిబిరాన్ని లయన్స్‌క్లబ్ గ్రీన్ ల్యాండ్స్ రాంకీ పౌండేషన్ సంస్థల సహకారంతో నిర్వహించారు. కార్యక్రమంలో పిటిసి వైస్ ప్రిన్సిపల్ ఎం.పిచ్చయ్య, జి.జగన్, డిఎస్పీలు పి. లక్ష్మీకాంత్, టి.లక్ష్మీ, కెవివిజయ్‌కుమార్, ఎం.శ్రీధర్‌రెడ్డి, ఏఒ రామారావు, రాంకీ ఫౌండేషన్ ప్రతినిధులు రాంరెడ్డి, సుజాత, సుమలత, లయన్స్ క్లబ్ చైర్‌పర్సన్ లక్ష్మీకుమారి, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న అంబర్‌పేట పోలీస్ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ మధుకర్‌స్వామి



## నేడు గోషామహల్ స్టేడియంలో 'పోలీస్ ఫ్లాగ్ డే'

**సైఫాబాద్, అక్టోబరు 20 ప్రభాతవార్త:** పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21వ తేదీ శనివారం ఉదయం 8.45 గంటలకు గోషామహల్ స్టేడియంలో 'పోలీస్ ఫ్లాగ్ డే' జరగనుంది. ఈ సందర్భంగా రాష్ట్ర డిజిపి అంజనీకుమార్ సందేశాన్ని అందజేస్తారని, ఈ ఏడాది దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమర పోలీసులకు నివాళులు అర్పిస్తారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పోలీస్ అధికారులు, పదవి విమరణ చేసిన పోలీస్ అధికారులు, పోలీస్ అమర కుటుంబాలు పాల్గొంటాయని డిజిపి సిపిఆర్ఓ శుక్రవారం నాడిక్కడ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.




అంబర్‌పేట్ మున్సిపల్ గ్రౌండ్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి స్మృతిఇరానీ, తదితరులు

# చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

**9 సెల్‌పోన్లు, ఒక బైకు స్వాధీనం**



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రామలింగరాజు

**బేగంపేట అక్టోబరు 20, ప్రభాతవార్త**

రోడ్డుమీద నడుచుకుంటూ వెళ్లేవారిని లక్ష్యంగా చేసుకుని వారినుంచి సెల్ ఫోన్లను చోరీ చేస్తున్న ఇద్దరు ముఠా సభ్యులను బేగంపేట పోలీసులు అరెస్ట్ చేసారు. వారినుంచి 9 సెల్‌ఫోన్లు, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలియజేసారు. బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్లు భాస్కర్, మల్లేశంతో కలిసి ఏసీపీ రామలింగరాజు వివరాలను వెల్లడించారు. బోయిన్‌పల్లి హస్మత్‌పేటకు చెందిన బొబ్బిలి అనిల్(40), బండారి కృష్ణ(23) కలిసి బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పరేడ్ మైదానం పరిసర ప్రాంతాల్లో సెల్‌ఫోన్ల చోరీలకు పాల్పడ్డారన్నారు. ఆ మార్గంలో నడుచుకుంటూ వెళుతున్న వారు, ద్విచక్రవాహనం పై ఒంటరిగా ప్రయాణం చేస్తున్న వారిని లిఫ్ట్ అడిగినట్లు అడిగి వారు బండి ఆపగానే వారి జేబులో ఉన్న మొబైల్ లాక్కుని పారిపోయే వార న్నారు. ఈ మధ్యకాలంలో బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు ప్రాంతాల్లో సెల్‌ఫోన్ల చోరీలకు ఈ ముఠా సభ్యులు పాల్పడ్డారన్నారు. ఈ మేరకు బాధితుల నుంచి ఫిర్యాదు అందుకున్న బేగంపేట పోలీసులు బాలంరాయి జంక్షన్‌లో వాహన తని ఖీలు నిర్వహిస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన బండారి కృష్ణ, బొబ్బిలి అనిల్‌ను అను మానంతో అదుపులోకి తీసుకుని ప్రశ్నించడంతో వారు చేసిన నేరాల వివరాలు వెల్లడించారన్నారు. నిందితుల నుంచి 9 సెల్‌ఫోన్లు, ఒక మోటారు బైకు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులలో బండారి కృష్ణ గతంలో ఒక హత్య, మరో దొంగతనం కేసులో నిందితుడని ఏసీపీ తెలియజేసారు. నిందితులను చాకచక్యంతో పట్టుకున్న ఇన్స్‌పెక్టర్ భాస్కర్, డిఐ మల్లేషం, డిఎస్సై నాగరాజు, క్రైం సిబ్బంది మహేష్, హరీష్, పూర్ణచందర్, మహిళా పీసీ నందినిని ఏసీపీ అభినందించారు. రివార్డు కోసం పంపుతామని ఏసీపీ తెలియజేసారు.



తుకారాంగేట్‌లో కాంగ్రెస్ నేతలతో సమావేశమైన అభ్యర్థి సంతోష్

## కాంగ్రెస్ పార్టీ విజయానికి కలిసికట్టుగా పనిచేయాలి

**అడ్డగుట్ట, అక్టోబర్ 20 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ అసెంబ్లీలో కాంగ్రెస్ విజయానికి కార్యకర్తలు, నాయకులు కలిసి కట్టుగా పనిచేయాలని కాంగ్రెస్ అభ్యర్థి అదం సంతోష్ కుమార్ విజ్ఞప్తిచేశారు. మంగళవారం ఆయన అడ్డగుట్ట కాంగ్రెస్ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ నెల 22వ తేదీన అడ్డగుట్టలోని చంద్రయ్య హోటల్ నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అడ్డగుట్టకు చెందిన ప్రముఖ నాయకుడు ఎస్. యాదగిరి, కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆదం ఉమాదేవీ, కాంగ్రెస్ నాయకులు దాడిగ సందీప్, గంట రాజు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్‌లో బిఆర్ఎస్‌ను గెలిపించాలి : లాస్య



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బిఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందిత

**కంటోన్మెంట్,అక్టోబర్ 20 ప్రభాతవార్త:** అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని కంటోన్మెంట్ బిఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందిత విజ్ఞప్తి చేశారు. మంగళవారం 4వ వార్డులోని పికెట్, లక్ష్మినగర్, హరిజన బస్తీ, సుబ్బారావు కాలనీ, విజయనగర్ కాలనీ పరిసర ప్రాంతాల్లో మాజీ బోర్డు సభ్యురాలు నళిని కిరణ్, బిఆర్ఎస్ నేతలు పనస సంతోష్,శ్రీకాంత్, వినోద్, గంగారామ్‌లతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తమను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా లాస్య మాట్లాడుతూ దివంగత ఎమ్మెల్యే సాయన్నలాగే తాను ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రాంమోహన్, కిరణ్, నరేశ్, మహేశ్, సదానంద్‌గౌడ్, సురేఖ, అశోక్, మురళీయాదవ్, మధు, సందీప్ పాల్గొన్నారు.

## కంటోన్మెంట్‌లో లాస్యను గెలిపించాలి : నర్సింహముదిరాజ్

**కంటోన్మెంట్, అక్టోబర్ 20 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గం బిఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందితను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ జిహెచ్ఎంసి మాజీ కో-ఆప్షన్ సభ్యులు నర్సింహముదిరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం రెజిమెంటల్ బజార్‌లోని వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి బిఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందితను గెలిపించాలని కోరుతూ ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కాశిరెడ్డి, శేఖర్ ముదిరాజ్, రాంమోహన్, అశోక్, భాస్కర్, సతీష్ పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ బూత్‌స్థాయి సమావేశాలు..



సమావేశాల్లో పాల్గొన్న బిఆర్ఎస్ శ్రేణులు

**నిజాంపేట, అక్టోబర్ 20, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద్ సూచనల మేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, ఎన్ఎంసి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, 13వ డివిజన్ పరిధిలో బాలాజీ వెస్ట్ కౌంటీలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆవుల జగన్ యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం బూత్‌స్థాయి సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేష్, సాయి ముదిరాజ్, స్థానిక డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు, బాలాజీ వెస్ట్ కౌంటీ అసోసియేషన్ సభ్యులు మధు, వెంకటేశ్వర్లు, సాయి, మూర్తి, ప్రవీణ్, అనుబంధ కమిటీ సభ్యులు, యువ నాయకులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ సన్నాహక సమావేశం..



సమావేశంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు

**నిజాంపేట, అక్టోబర్ 20, ప్రభాతవార్త :** 19వ డివిజన్ భైరుని చెరువు వద్ద బిఆర్ఎస్ సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ ఆగంపాడు ముదిరాజ్, నాయకులు కోలన్ గోపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు కాసాని సుధాకర్‌ముదిరాజ్, బాలాజీనాయక్, ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, ఆయా డివిజన్ వాసులు, స్థానికులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమస్యలు వాటి పరిష్కారం కోసం చేపట్టాల్సిన పనులు, అలాగే ఎమ్మెల్యే వివేకానంద్ గెలుపునకు కృషి చేయాలని తీర్మానించుకున్నారు.

## కాంగ్రెస్‌లో చేరికలు...



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి

**అల్వాల్, అక్టోబరు 20 ప్రభాతవార్త:** మచ్చబొల్లారంలో కార్పొరేటర్ జితేందర్‌నాథ్ ఆధ్వ ర్యంలో జరిగిన సమావేశంలో స్థానికులు పలువురు హస్తంపార్టీలో చేరారు. ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది. అసెంబ్లీ ఎన్నికలులో కాంగ్రెస్ విజయం సాధించ నున్నదని తెలిపారు. మల్కాజిగిరి నుంచి మరోసారి విజయాన్ని సాధించనున్నానని చెప్పారు.

## త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని కలిసి బిజెపి నేతలు

**అల్వాల్, అక్టోబరు 20 ప్రభాతవార్త:** త్రిపుర గవర్నర్‌గా నియమితులైన నల్లు ఇంద్రసేనారెడ్డికి అల్వాల్‌కు చెందిన నేతలు అభినందనలు తెలిపారు. బిజెపి సీనియర్ నేత దండుగుల వెంకటేష్‌తో పాటుగా మల్లిఖార్జున్ యాదవ్, ఎం.శ్రీనివాస్‌లు ఇంద్రసేనా రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు.



ఇంద్రసేనా రెడ్డికి అభినందనలు తెలుపుతున్న నేతలు

# ప్రజల రుణం తీర్చుకోవడానికి మరింత శ్రమిస్తా

### డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్



ఓట్లువేసి గెలిపించాల్సిందిగా ప్రజలను కోరుతున్న పద్మారావుగౌడ్

**సికింద్రాబాద్, అక్టోబర్ 20 ప్రభాతవార్త :** నిరంతరం ప్రజలతో సంబంధాలు కలిగి, వారి సంక్షేమానికి కృషిచేసే నాయకులనే ప్రజలు ఆదరిస్తారని డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ బిఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం సీతాఫల్‌మండి డివిజన్‌లో పాదయాత్రను ప్రారంభించారు. ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. కాలనీలు, బస్తీల్లో స్థానికులు ఆయనకు హారతులతో స్వాగతం పలికారు. జోషి కాంపౌండ్ నుంచి ప్రారంభం అయిన పాదయాత్ర దత్తాత్రేయ టెంపుల్, వీరయ్యగల్లి, సందీప గల్లి, మేడిబావి, దేడ్‌లాక్ బిల్డింగ్, రామాలయం వీధి, బీదలబస్తీ, టీఆర్‌టీ క్వార్టర్స్ తదితర ప్రాంతాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ ప్రజలకు తాము రుణపడి ఉంటామని, సికింద్రాబాద్ ప్రజల రుణం తీర్చుకునేందుకు మరింత శ్రమిస్తామన్నారు. సిఎం కేసీఆర్, సికింద్రాబాద్ ఎంఎల్ఏగా తాము విజయం సాధించడం ఖాయమన్నారు. సీతాఫల్‌మండిలో ఎన్నో సమస్యలను పరిష్కరించామని, గతంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించామని, ఇటీవల ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీ ఏర్పాటుకు అనుమతి సాధించడంతో పాటు కొత్త భవనాల నిర్మాణాన్ని రూ. 30 కోట్లతో చేపట్టామన్నారు. ఈ కార్యాక్రమంలో కార్పొరేటర్‌లు సామలహేమ, సునిత, శైలజ, ప్రసన్నలక్ష్మీ, నేతలు కిషోర్‌కుమార్, రామేశ్వర్‌గౌడ్, కిరణ్‌కుమార్, త్రినేత్రగౌడ్, కరాటేరాజు తదితరులు పాల్గొన్నారు.



గెలుపొందినవారికి బహుమతులు అందజేస్తున్న దృశ్యం

## జలసౌధలో ఘనంగా బతుకమ్మ సంబురాలు

**హైదరాబాద్, అక్టోబరు 20, ప్రభాతవార్త :** ఎర్రమంజిల్‌లోని సాగునీటి ప్రధాన కేంద్రం జలసౌధలో శుక్రవారం బతుకమ్మవవేడుకలు ఘనంగా జరిగాయి. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈవేడుకల్లో ఛీఫ్ ఇంజనీర్ స్థాయి నుంచి క్లారికల్ స్థాయివరకు అందరూ పాల్గొన్నారు. అంతకుముందు సాగునీటిశాఖ ఇంజనీర్ (పరిపాలన)అనిల్, ఇంజనీర్ ఛీఫ్ నాగేందర్‌రావు, సిఎం ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే ముఖ్య అతిధులుగా హాజరై ఉత్సవాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఛీఫ్ ఇంజనీర్లు అనిత, శ్రీదేవి, ప్రమీల, శారద, డిఈఈ రమాదేవితోపాటు వందమంది మహిళా ఇంజనీర్లు, ఉద్యోగులు పాల్గొని బతుకమ్మ ఆడారు. ఈసందర్భంగా జరిగన ముగింపు వేడుకల్లో సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్‌కు మొదటి బహుమతి, జలసౌధ బిల్డింగ్ నిర్వాహణ యూనిట్‌కు రెండవ బహుమతి, ఇంజనీర్ ఇన్ ఛీఫ్ పరిపాలన విభాగానికి మూడవ బహుమతి అందజేశారు.

## సరస్వతి అలంకారంలో దర్శన మిచ్చిన అమ్మవారు

**బేగంపేట అక్టోబరు 20,ప్రభాతవార్త :** సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఈఓ గుత్తా మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో పటిష్టమైన ఏర్పాట్లు చేసారు.

## అమ్మవారిని పూజిస్తే కోలిన కోర్కెలు తీరుతాయి : జంపన ప్రతాప్

**కంటోన్మెంట్, అక్టోబర్ 20 ప్రభాతవార్త:** నవరాత్రుల్లో అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ తెలిపారు.దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని 1వ వార్డు బాపూజీనగర్, 6వ వార్డు సీతారామ్‌పూర్‌లోని శ్రీభవానీ శివహన్‌మాన్ దేవాలయంల్లో శుక్రవారం నిర్వహించిన అభిషేకాలు, పంచామృత పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ బోర్డు సభ్యురాలు జంపన విద్యావతి, ప్రతినిధులు లావణ్య, రుషి, ప్రేమ్‌ముదిరాజ్, అజిత్, జహింగీర్,రామారావు, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీఉజ్జయినీ మహాకాళీ మాణిక్యాలమ్మ సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదానం

**బేగంపేట అక్టోబరు 20,ప్రభాతవార్త :** సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ సేవా సమితి ఆధ్వర్యంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భారీఎత్తున భక్తులు ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహకులు మహేష్ మాట్లాడుతూ ప్రతి ఏడది మహాకాళీ జాతర,నవరాత్రుల సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అమ్మ వారి ఆశీస్సులతో భక్తులకు ప్రతి ఏటా ఇలా అన్నదానం చేసే అదృష్టం తమకు కలగడం అమ్మ వారి కృప అని ఆయన తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రమణరాజు, మోహన్, సూరజ్, శేఖర్, సతీష్, భూషణ్, ప్రవీణ్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

**సంజీవరెడ్డి నగర్, అక్టోబర్ 20, ప్రభాతవార్త :** అమీర్‌పేట బల్కంపేట ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానంలోని మూలవిరాట్ అమ్మవారిని 6వ రోజు నాడు మహాలక్ష్మీదేవిగా వివిధ రకాల కరెన్సీ నోట్లతో, నాణేలతో అలంకరించినట్లు ఆలయ ఈఓ కె.నాగరాజు, చైర్మన్ సాయిబాబాగౌడ్‌లు తెలిపారు. మహాలక్ష్మీ రూపంలోని అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. దర్శనార్థం వచ్చినటువంటి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిరంతరం భక్తుల నడుమనేవుండి చూసుకుంటున్నట్లు ఈఓ నాగరాజు, చైర్మన్ సాయి బాబాగౌడ్, సూపరింటెండెంట్ రంగు రమేష్ పర్యవేక్షణలో వుంటున్నామన్నారు.

## క్రియేటివ్ స్పీసీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రీన్ మేళా

**సంజీవరెడ్డినగర్, అక్టోబర్ 20, ప్రభాతవార్త :** దాదాపు 50 స్టాల్స్‌తో కూడిన ఆకర్షణీయమైన శ్రేణిలో గ్రీన్ మేళాను శుక్రవారం నిర్వహించారు. ఈ స్టాల్స్‌లో పోషకమైన మిల్లెట్స్, సేంద్రియ, సహజమైన ఆహారాలు, ఆరోగ్యకరమైన రుచికరమైన వంటకాల నుండి కార్న్యూకోపియాను కలిగి ఉంటుంది. మిల్లెట్ ఆధారిత ఆహారం యొక్క అనేక ప్రయోజనాలు, సేంద్రియ సహజ వ్యవసాయం యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచడం గ్రీన్ మేళా యొక్క ముఖ్య ఉద్దేశం.

## 'గాంధీనగర్ బతుకమ్మ సంబురాలు' గోడపత్రిక ఆవిష్కరణ

**చిక్కడపల్లి, అక్టోబరు 20 ప్రభాతవార్త:** గాంధీనగర్ డివిజన్ పరిధిలో స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ ఆధ్వర్యంలో నిర్వహింతలపెట్టిన 'గాంధీనగర్ బతుకమ్మ సంబురాలు' కార్యక్రమాలకు సంబంధించిన గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. 21న ఆంధ్రాకేఫ్ చౌరస్తా వద్ద ఈ కార్యక్రమం జరుగుతుంది. ఈ సందర్భంగా గోడపత్రికను బిజెపి మహిళా మోర్చ నాయకులు శ్రీమతి, తులసి, మంగమ్మ, సంయుక్తరాణి, రాణి, శ్యామల పాల్గొని ఆవిష్కరించారు. తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పే విధంగా డివిజన్‌లో బతుకమ్మ సంబురాలు ఏర్పాటు చేశామని, ప్రతి మహిళ, ఆడ పడుచులు, పిల్లలు పెద్దఎత్తున బతుకమ్మ వేడుకల్లో పాల్గొనాలని కార్పొరేటర్ పావనీ వినయకుమార్ కోరారు.



బెనర్జీకి నియామకపత్రం అందిస్తున్న శ్రీనివాస్‌రావు

## ఎలక్ట్రికల్ లైసెన్స్‌బోర్డు మెంబర్‌గా నేమాల బెనర్జీ నియామకం

**హైదరాబాద్, అక్టోబరు 20,ప్రభాతవార్త:** తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు మెంబర్‌గా నేమాల బెనర్జీ నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం తెలంగాణ ప్రభుత్వ విద్యుత్ తనిఖీ అధికారి ఎస్.శ్రీనివాస్‌రావు చేతులమీదుగా నియామకపత్రం అందుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు మాజీ మెంబర్ నక్కా యాదగిరి, కె.మహేష్, వి.నరేష్ పాల్గొన్నారు.

## మానసిక ప్రశాంతతకు భక్తిమార్గం అనువైన మార్గం : ఎమ్మెల్యే



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, ముఠా జైసింహా, శ్రీధర్‌రెడ్డి తదితరులు

**చిక్కడపల్లి, అక్టోబరు 20 ప్రభాతవార్త:** మానసిక ప్రశాంతకు భక్తిమార్గం అనువైన మార్గమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. గురువారం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లో జైమాతాది యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వాహక సంస్థ అధినేత, జై యువసేన అధినేత శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన అమ్మవారి మంటపం వద్ద ఎమ్మెల్యేముఠాగోపాల్, బిఆర్ఎస్ యువనేత ముఠా జైసింహా పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ముఠాపద్మానరేశ్, బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేశ్‌కుమార్, నేతలు ముచ్చుకుర్తి ప్రభాకర్, నేతలు మారిశెట్టి నర్సింగరావు, రవిశంకర్‌గుప్త, అసోసియేషన్ సభ్యులు సాయిచాణక్యరెడ్డి, సాయియాదవ్, బాలు, మహేందర్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు. కలియుగంలో భక్తిమార్గానికి ఎంతో ప్రాధాన్యత ఉందని, నేడు మనుషుల మధ్య బంధుత్వాలైనా, స్నేహాలైనా అన్ని సహజతత్వాలను కోల్పోయి పేరుకు మిగిలిపోతున్నాయని, ఆ అసహజాలను ద్వేషాలు, ద్రోహాలు లేకుండా దాటించగల శక్తి భక్తి మార్గం అని ముఠాగోపాల్ అన్నారు.

## మందుల కులస్తుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

**చిక్కడపల్లి, అక్టోబరు 20ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర మందుల కులమ్ రాష్ట్ర సర్వసభ్య సమావేశం శుక్రవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడిగా సింగజోగి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. మొత్తం ఓట్లు 132 పోల్‌అవగా అందులో ఒకటి చెల్లలేదు. సంఘం అధ్యక్షుడిగా సింగజోగి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఓరుగంటి రమేశ్, ప్రధాన కార్యదర్శిగా మేకల లింగయ్య వివేకానంద, జల్లి అశోక్, దస్తగిరి, కోశాధికారిగా పి.కృష్ణ, ఓ.కుమార్, గౌరవ అధ్యక్షుడిగా మేకల రామస్వామితో పాటు ఉపాధ్యక్షులు, కార్యదర్శులను ఎన్నుకున్నారు. అనంతరం సింగజోగి శ్రీనివాస్ మాట్లాడుతూ మందుల కులస్తుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సంచార జాతుల అధ్యక్షుడు ఒంటెద్దు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## గౌసియాబేగం కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలి

**చిక్కడపల్లి, అక్టోబరు 20 ప్రభాతవార్త:** ఇటీవల తీవ్ర అనారోగ్యంతో మరణించిన ఉస్మానియా హాస్పిటల్ ఆరోగ్యమిత్ర ఉద్యోగి అయిన గౌసియాబేగం కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గిరియాదయ్య కోరారు. బాగ్‌లింగంపల్లిలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ ఆదుకుని వారి కుటుంబానికి రూ.50లక్షల ఆర్థిక సహాయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. గౌసియాబేగం ఒక్కరే కాకుండా ఈ మధ్యకాలంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్యమిత్రాలు చాలిచాలని వేతనాలతో కుటుంబ పోషణ భారంగా మారి తీవ్ర వత్తిడికి లోనై అనారోగ్యానికి గురై మరణిస్తున్నారని, వారందరి కుటుంబాలను మానవతా దృక్పథంతో ప్రభుత్వంగాని, ఆరోగ్యక్షశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్‌గాని ఆదుకోవాలని కోరారు.

## సరస్వతిదేవి అలంకారంలో అమ్మవారు

**చిక్కడపల్లి, అక్టోబరు 20 ప్రభాతవార్త:**

శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని చిక్కడపల్లి శ్రీవారి ఆలయం వీధిలో నేతాజి ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంటపం వద్ద అమ్మవారు శుక్రవారం మూలానక్షత్రం సందర్భంగా సరస్వతిదేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆత్మబంధు, కల్యాణందపీఠం పీఠాధ్యక్షులు బ్రహ్మశ్రీ ఆచార్య డాక్టర్ పులిగడ్డ హనుమంతరాయశర్మ వారి శిష్యబృందం నాగరాజుశర్మ, సాయినాథశర్మ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. నిర్వాహకులు, మాజీ కార్పొరేటర్ పలుస బాల్‌రాజ్‌గౌడ్, కందూరి కృష్ణ, రాపర్తి రాజగోపాల్, చంద్రమోహన్‌గౌడ్, పెండ్యాల చందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంటపాన్ని భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా సోమవారం అమ్మవారు దుర్గాదేవి అలంకారంతో దర్శనమిచ్చారు.



గులాబీ కండువా కప్పి పార్టీలోకి

## కుత్బుల్లాపూర్‌లో గులాబీ జెండా ఎగరడం ఖాయం : ఎమ్మెల్యే

**నిజాంపేట, అక్టోబర్ 20, ప్రభాతవార్త :** రాబోయే ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగిరేసి హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని ఎమ్మెల్యే కెపి వివేకానంద్ అన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ 26వ డివిజన్ పరిధి మధురానగర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఎమ్మెల్యే కెపి వివేకానంద్, మేయర్ కోలన్ నీలాగోపాల్‌రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి డిప్యూటీ మేయర్ ధనరాజ్‌యాదవ్, ఎన్ఎంసి బిఆర్ఎస్ అధ్యక్షులు రంగ రాయ ప్రసాద్, కార్పొరేటర్ రాఘవేంద్రరావు, ప్రజాప్రతినిధుల సమక్షంలో శ్రీవెంకటేశ్వర సమేత అష్టలక్ష్మీ ఆలయ చైర్మన్ బిజెపి మున్సిపల్ వైస్ ప్రెసిడెంట్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, వారి సభ్యులు అదేవిధంగా ప్రగతినగర్ నాయి బ్రాహ్మణ సేవా సంఘం ప్రెసిడెంట్ రమేష్, ఎన్ఎంసి బిఆర్ఎస్ మైనార్టీ వైస్ ప్రెసిడెంట్ ఎం.డి.సలీం ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ నగర్ ముస్లీం మైనార్టీ సోదరులు పలువురు కాంగ్రెస్, బీజెపి పార్టీల నుండి బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, ఎన్ఎంసి బిఆర్ఎస్ అధ్యక్షులు, ఆయా డివిజన్ అధ్యక్షులు, అనుబంధ కమిటీ సభ్యులు, నాయకులు, యువ నాయకులు, మహిళా నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి : సర్వే సత్య నారాయణ



బోయిన్‌పల్లి నల్లపోచమ్మ దేవాలయంలో పూజలు చేస్తున్న కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ

**కంటోన్మెంట్, అక్టోబర్ 20 ప్రభాతవార్త:** ప్రజలు సుఖసంతోషాలతో ఆరోగ్యంగా జీవించాలని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని కేంద్ర మాజీమంత్రి సర్వే సత్యనారాయణ అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం కంటోన్మెంట్ 1వ వార్డు బాపూజీ నగర్‌లోని నల్లపోచమ్మ దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు, అన్నదానంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు బద్దం బల్వంత్‌రెడ్డి, దండుగుల యాదగిరి, అజిత్‌కళ్యాణ్, క్రిష్ణ, ప్రేమ్‌ముదిరాజ్, మురళీ పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలు అందించిన శాంతరాజుకు డాక్టరేట్





డాక్టరేట్ పురస్కారం అందుకుంటున్న శాంతిరాజు

**అడ్డగుట్ట, అక్టోబర్ 20 ప్రభాతవార్త:** కరీంనగర్ జిల్లాకు చెందిన ఆశీర్వాద లైఫ్ లైన్ విజన్ సంస్థ వ్యవస్థాపకులు ఆకెపోగు శాంతి రాజుకు యూఎస్ఏ డే స్ప్రింగ్ క్రిస్టియన్ యూనివర్సిటీ వారు ఆయన సేవలను గుర్తించి డాక్టరేట్ పురస్కారం అందజేశారు. మంగళవారం మారేడ్‌పల్లిలోని హోళీ లిటిల్ చర్చిలో క్రిస్టియన్ మైనార్టీ ప్రతినిధులు శాంత రాజును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఆకెపోగు పుష్యరాగం,సాయికిరణ్, వెరోనిక, జెన్నీ, జెసిక్కా పాల్గొన్నారు.

## సికింద్రాబాద్ పాలిక బజార్‌లో బ్యాగ్‌ల దుకాణం దగ్ధం

**కంటోన్మెంట్,అక్టోబర్ 20 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ స్టేషన్ పాలిక బజార్‌లో ఓ బ్యాగుల దుకాణంలో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో దాదాపు 5 లక్షల ఆస్థి నష్టం వాటిల్లిందని మార్కెట్ పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాల ఇలా ఉన్నాయి. చిలుకలగూడ ప్రాంతానికి చెందిన సయ్యద్ హుస్సేన్ పాలిక బజార్‌లో సిటీ కలెక్షన్ పేరుతో బ్యాగ్‌ల దుకాణం నిర్వహిస్తున్నాడు. శుక్రవారం ఉదయం షెల్లార్‌లో నుంచి దట్టమైన పొగలు వ్యాపించడంతో విషయాన్ని గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి, మార్కెట్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది, జిహెచ్ఎంసి డిఆర్ఎఫ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకొని ఎగసిపడుతున్న మంటలను ఆర్పివేశారు. దుకాణంలో లెదర్ బ్యాగ్‌లు ఉండడంతో దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. వాటి పక్కన ఉన్న షాప్‌లకు ఎలాంటి ప్రమాదం జరుగలేదు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ అధికారి ప్రసన్నకుమార్, అగ్నిమాపక అధికారులు మధుసూదన్, ధనుంజ రెడ్డి, మోహన్ రావ్‌లు పాల్గొన్నారు.

## ప్రకృతి ఆరాధన అనుబంధాల సమ్మిళితమే బతుకమ్మ

### తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు



**నాంపల్లి, అక్టోబరు 20 ప్రభాతవార్త :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనంగా అత్యంత భక్తిశ్రద్ధలతో మహిళలు విశ్వవ్యాప్తంగా జరుపుకొనే ప్రకృతి ఆరాధన, అనుబంధాల సమ్మిళిత పూల ఉత్సవమే బతుకమ్మ పండుగని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు అభివర్ణించారు. విశ్వవిద్యాలయం విస్తరణ సేవావిభాగం ఆధ్వర్యంలో నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్ద నున్న విశ్వవిద్యాలయ ప్రాంగణం తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బతుకమ్మ సంబరాలు పేరిటన విశ్వవిద్యాలయ మహిళా సిబ్బంది పెద్దయెత్తున విద్యార్థినిలతో కలిసి శుక్రవారం తెలంగాణ గ్రామీణ జీవనం ఉట్టిపడేలా సంప్రదాయ బతుకమ్మ గీతాలను ఆలపిస్తూ ఆనందోత్సాహాలతో జరుపుకోవడం హర్షదాయకమని వారికి శుభాకాంక్షలు తెలిపారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ భట్టురమేష్ తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెప్పే రమణీయ కమనీయ దృశ్యం బతుకమ్మ కేవలం తెలంగాణ ప్రాంతానికి పరిమితం కాకుండా విశ్వవ్యాప్తంగా విరాజిల్లుతూ ప్రత్యేక గుర్తింపును సంతరించుకొందన్నారు. ఉదయం నుండే విశ్వవిద్యాలయం మహిళా ఉద్యోగులు రంగురంగు పూలతో బతుకమ్మను వివిధ సైజులలో ఆకర్షణీయంగా తీర్చిదిద్ది ఆధ్యాత్మికత ప్రతిబింబించేలా గౌరీపూజ చేసి నైవేద్యాలను సమర్పించారు. విశ్వవిద్యాలయం సంగీతశాఖ, జానపద కళలశాఖల విద్యార్థినులు బతుకమ్మ పాటలను వీనులవిందుగా ఆలపిస్తూ సంధ్యాసమయం వరకు బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు.

# ఎన్నికల మేనిఫెస్టోను గడప గడపకు తెలియజేయాలి : ఎమ్మెల్యే



మేనిఫెస్టోను విడుదల చేసిన బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు

**జీడిమెట్ల, అక్టోబర్ 20, ప్రభాతవార్త :** సిఎం కెసిఆర్ విడుదల చేసిన ఎన్నికల ప్రజా మేనిఫెస్టోను బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గడప గడపకు తెలియజేయాలని ఎమ్మెల్యే కెపి వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గండిమైసమ్మ పరిధిలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద ఎన్నికల ప్రజా మేనిఫెస్టోను శుక్రవారం మేడ్చల్ జిల్లా ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్ ప్రజా ప్రతినిధులు కార్యకర్తలతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కెసిఆర్ విడుదల చేసిన మేనిఫెస్టో ప్రతిపక్షాలకు నిద్రలేకుండా చేసిందన్నారు. సబ్బండ వర్గాల సంక్షేమం, స్వావలంబనే లక్ష్యంగా మేనిఫెస్టో ఉండటం హర్షణీయమన్నారు. రాష్ట్రంలో 93 లక్షల కుటుంబాలు లబ్ధిపొందేలా 5లక్షల బీమా కల్పించడం గొప్ప నిర్ణయమని, ఆసరా ఫించన్‌లను దశలవారీగా రూ.5000 వరకు పెంచడం సంతోషకరమన్నారు. రైతుబంధును 16వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకోవడంపై రైతాంగానికి శుభవార్త అని, నియోజకవర్గంలో 65000 ఇళ్ల నిర్మాణం చేసి ప్రజలకు అందజేస్తామని తెలిపారు. ఆరోగ్యశ్రీ 15 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. గృహలక్ష్మీ ద్వారా అర్హులైన ప్రతీ ఒక్కరికీ 3 లక్షల, అసైండ్ భూములను అమ్మకానికి రైతుకు హక్కు కలి్పచేందుకు ముందుకు రావడం, ఈ పదేళ్లలో జరిగిన అభివృద్ధిని ప్రజలు బేరీజు వేసుకోవాలన్నారు. ఈ రెండు దఫాల్లో వేలకోట్ల రూపాయలతో నియోజక అభివృద్ధి కోసం ఖర్చు చేశామన్నారు. విజన్ ఉన్న నాయకుడు సీఎంగా ఉండటం వల్లే కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని ఇంతలా అభివృద్ధి పరిచేందుకు అవకాశం దొరికిందన్నారు. గతంలో 41వేల మెజార్టీ ఇచ్చిన మీరు ఈసారి అంతకన్నా భారీ స్థాయిలో మెజార్టీ ఇచ్చి కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని మరింత అద్భుతంగా అభివృద్ధికి సహకరించాలన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో తాము చేసిన అభివృద్ధి, చేయబోయే అభివృద్ధి పనులు, వివిధ సంక్షేమ పథకాలను ప్రణాళిక రూపంలో విడుదల చేసిన మేనిఫెస్టోను నాయకులు, కార్యకర్తలు గడప గడపకు ప్రచారం నిర్వహించి ప్రభుత ం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, కుత్బుల్లాపూర్ నియో జకవర్గంలో జరిగిన అభివృద్ధిని వివరించి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమం లో బిఆర్ఎస్ ప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



త్రిపుర గవర్నర్ నల్లూ ఇంద్రాసేనారెడ్డిని కలిసి సన్మానిస్తున్న బిజెపి రాష్ట్ర కార్యాలయ ఇన్‌చార్జి డి.గోపాల్‌జీ, చంద్రశేఖర్ తదితరులు

## ఎమ్మెల్యే మైనంపల్లికి మహిళల ఘన స్వాగతం



ఎమ్మెల్యే మైనంపల్లికి హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

**హైదరాబాద్,అక్టోబర్ 20 ప్రభాతవార్త :** గౌతమ్‌నగర్‌డివిజన్ పరిధిలోని ఐఎన్ నగర్‌లో బిఆర్ఎస్‌నుండి రామ్‌చందర్, కొమురయ్యతో పాటు సుమారు 100 మంది ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరినవారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు హారతులు ఇచ్చి ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం ఈస్ట్ ఆనంద్‌బాగ్‌లో ఎమ్మెల్యే మైనంపల్లి సిపిఎం నాయకులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, లక్ష్మణ్‌లను కలిసి మద్దతు కోరారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, జిఎన్‌వి సతీష్‌కుమార్, బికే.శ్రీనివాస్, కన్నెమల నాగరాజు, సనాదియాదవ్, వినోద్‌యాదవ్, డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్, ఫరీద్, సంతోష్ రాందాస్, గ్యారా ప్రవీణ్, బాలరాజుయాదవ్, శంకర్, తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



హరిహర క్షేత్రంలో సీతా కళ్యాణం నాట్యాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

**మలక్‌పేట, అక్టోబర్ 20 ప్రభాతవార్త :** మలక్‌పేటలోని శ్రీ హరిహర క్షేత్రంలో అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భరతనాట్యంలో ఎంతో మంచి పేరు సంపాదించిన అభినవ కళారత్న గీత గణేషన్ వారి శిష్య బృందం సీతా కళ్యాణం విరచిత కీర్తనల ఆధారంగా రూపొందించిన నత్య రూపకాన్ని ప్రదర్శించారు. చక్కటి హావభావాలతో సీతాకళ్యాణం ఘట్టాన్ని ప్రదర్శించగా గీత గణేషన్ నట్టు వాంగంతో పాటు తమ శ్రావ్యమైన గొంతుతో పాటలను ఆలపించి భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నారు. దేవాలయ ట్రస్ట్ చైర్మన్ సూగూరు రమేష్, పారిజాతరెడ్డి వేద పండితుల మధ్య కాసుల చంద్రశేఖర్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రతిరోజు దేవాలయంలో పలు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు 21వ తేదీన ఉదయం సామూహిక చండీ హోమం, 22న సద్దుల బతుకమ్మ, 23న విజయదశమి సందర్భంగా శమీ పూజ తదితర పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు మంగళగిరి శ్రీనివాసాచార్యులు, ఇవో మార్తాండరావు, సభ్యులు శ్రీహరి, రేణు అగర్వాల్, సత్యేందర్, విజయ్‌కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## భవానినగర్‌లో బీఆర్ఎస్ ప్రచారం : శాంతిశేఖర్



బీఆర్ఎస్ కరపత్రాన్ని అందజేస్తున్న కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

**నాచారం, అక్టోబర్ 20 ప్రభాతవార్త:** ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బీఎల్ఆర్ గెలుపుకోసం కలిసికట్టుగా పనిచేయాలని కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ పేర్కొన్నారు. ఎన్నికలప్రచారంలో భాగంగా శుక్రవారం రాజీవ్‌నగర్, వీరారెడ్డి నగర్ తదితర ప్రాంతాల్లో గడపగడపకు బీఆర్ఎస్ పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ బీఆర్ఎస్ చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ ప్రచారాన్ని కొనసాగించారు. ప్రజల నుంచి మంచిస్పందన ఉందని బీఆర్ఎస్‌ను గెలిపిస్తామని స్థానికులు చెబుతున్నారని కార్పోరేటర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కెసిఆర్ నాయకత్వంలో సురక్షిత పాలన : మంత్రి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**హైదరాబాద్, అక్టోబర్ 20 ప్రభాతవార్త:** రాష్ట్రంలో కెసిఆర్ నాయకత్వంలో సురక్షిత పాలన అందిస్తున్నామని మంత్రి సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. హరిపురికాలనీ సంక్షేమ సంఘం భవనంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించగా మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాలనీవాసులు పూలజల్లు కురిపిస్తూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాలనీలో మౌలిక వసతులు కల్పించడం జరిగిందని తెలిపారు. ఐదు సంవత్సరాలుగా నియోజకవర్గంలోని చాలా సమస్యలు పరిష్కరించడం జరిగిందన్నారు. సిఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో 24 గంటలు విద్యుత్, పరిపాలనా దక్షత, తాగునీరు అందిస్తూ రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ చైర్మన్ శ్రీధర్, బిఆర్ఎస్ ప్రధానకార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, డివిజన్ యూత్ వింగ్ మాజీ అధ్యక్షుడు శ్యామ్‌గుప్తా, గొడుగు శ్రీనివాస్, వెంకటేశంగుప్తా, కృష్ణమూర్తి, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 22వ తేదీన బతుకమ్మ ఉత్సవాలు

**వనస్థలిపురం, అక్టోబర్ 20 ప్రభాతవార్త :** శ్రీలక్ష్మీ గణపతి దేవాలయ ప్రాంగణంలో 22వ తేదీ సోమవారం బతుకమ్మ కార్యక్రమాలనుఘనంగా ఏర్పాటు చేస్తు న్నామని ఈ కార్యక్రమంలో విశేషంగా మహిళలు పాల్గొన వలసిందిగా ఆలయచైర్మన్ బి.అశోక్‌కుమార్‌గౌడ్‌తోపాటు కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి డాక్టర్ వి ప్రభాకర్, కోశాధికారి డి లక్ష్మారావు, వైస్ చైర్మన్లు మిట్ట రామ్మోహన్, కంచి కృష్ణమోహన్, జాయింట్ సెక్రెటరీ ఎల్.బాలేశ్వర్, సభ్యులు సురేష్, బ్రహ్మచారి, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ గెలుపు కోసం పని చేసే వారిని తప్పక గుర్తిస్తాం : మంత్రి సబితాఇంద్రారెడ్డి



కార్పొరేటర్ గౌరీ శంకర్‌కు గులాబి కండువా వేస్తున్న సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, అక్టోబర్ 20 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ విజయానికి కృషి చేసే పార్టీ నాయకులను, కార్యకర్తలను తప్పక గుర్తిస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, నియోజకవర్గ పార్టీ అభ్యర్థి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన 2వ డివిజన్ స్వతంత్ర కార్పొరేటర్ కొంద్రు గౌరీ శంకర్ బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జిల్లెలగూడ అంబేద్కర్‌నగర్‌లో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సభలో ఆయనతో పాటు పలువురు యువకులు, బిజెపి ఓబిసి ఉపాధ్యక్షుడు కేతరాజు సాయినాథ్ బిఆర్ఎస్‌లో చేరారు. వీరంతా మంత్రి సబితారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె వారికి గులాభి కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తనకు మద్దతుగా పార్టీలో చేరుతున్న వారిని సైతం గుర్తిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో కలిసి కట్టుగా పని చేసి బిఆర్ఎస్‌ను గెలిపించాలని ఆమె సూచించారు. పార్టీలో చేరిన గౌరీశంకర్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, ప్రాంతాల అభివృద్ధి కోసం వందలాది కోట్ల నిధులు తెచ్చి అహర్నిషలు సబితారెడ్డి పని చేస్తుండడాన్ని గుర్తించే బిఆర్ ఎస్‌లో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ ముదావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్, అర్కల భూపాల్‌రెడ్డి, బైగళ్ళ బాలమణి, బొక్క రాజేందర్‌రెడ్డి, గజ్జెల రాంచందర్, సిద్దాల లావణ్య బీరప్ప, లతశేఖర్‌గౌడ్, కామేష్‌రెడ్డి, పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణాలో బిజెపిదే విజయం



సమావేశంలో మాట్లాడుతున్న రాంచందర్‌రావు

**సైదాబాద్, అక్టోబరు 20 ప్రభాతవార్త:** తెలంగాణాలో బిజెపిదే గెలుపు అని మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు అన్నారు. భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పద్మావతి కళ్యాణమండపంలో నిర్వహించిన మలక్‌పేట నియోజకవర్గ మేధావుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ మేధావులు, యువత, నిరుద్యోగులు,ఉద్యోగులు బిఆర్ఎస్ ప్రభుత్వ నియంతృత్వ వైఖ రిపై ఆగ్రహంగా ఉన్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో బిఆర్ ఎస్‌కు తగిన గుణపాఠం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ మణికొండ ప్రవీణ్, సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, సుభాష్‌చందర్జీ తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజిగిరిలో బిఆర్ఎస్ విజయం ఖాయం



శ్రీ కాలనీ వాసులతో మాట్లాడుతున్న మర్రి రాజశేఖర్ రెడ్డి..

**నేరేడ్‌మెట్, అక్టోబర్ 20 ప్రభాతవార్త:** మల్కాజిగిరి నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ విజయం తప్పకుండా సాధిస్తుందని మల్కాజిగిరి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేసారు. శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని నేరేడ్‌మెట్ డివిజన్ శ్రీ కాలనీ, సైనిక్‌విహార్, వడ్డెర బస్తీ, ముత్యాలమ్మ దేవాలయం, శ్రీ వరదుర్గ దేవలయం, జెజెనగర్, ఎస్వీ ఆఫీసర్స్ తదితర కాలనీలో ఆయన ముఖ్య కార్యకర్తలు నాయకులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్కాజిగిరి నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చి దిద్దుతానన్నారు. నేరేడ్‌మెట్ పరిధిలోని వాజ్‌పేయినగర్‌లో రైల్వే బ్రిడ్జి నిర్మాణానిక సంబంధించిన విషయాన్ని కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సర్కిల్‌ఉపాధ్యక్షులు కొత్తపల్లి ఉపేందర్‌రెడ్డి, చిందం శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, శివ, అంజయ్య, రాజేష్, సాయిగౌడ , అంజయ్య, సుమాన్, రాయుడు, రమేష్, రఘుపతిరెడ్డి, గోపి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.
























































